సాక్షి నిజామాబాద్

గురువారం । 10 । జూలై । 2025



ఎత్తిపోతలకు మళ్లీ తాళం

సాలూర గ్రామ శివారులోని మంజీర నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకానికి మళ్లీ తాళం పడింది.

- 8లో ▸



ఉద్యానవన పంటలకు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యానవన పంటల సాగుకు ఊతమిస్తున్నాయి. రాయితీలు అందజేస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.5 /23.4

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఎంపీడబ్ల్యూ వేతనాలు విడుదల

సుభాష్‌నగర్: జిల్లాలోని 545 గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న 2,730 మంది మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి డీ శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు 3 నెలల వేతనాలకు సంబంధించి రూ.7.76కోట్లు గ్రామ పంచాయతీ టీజీబీ పాస్ ఖాతాల్లో జమయ్యాయని పేర్కొన్నారు. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించి వేతనాలను మల్టీపర్పస్ వర్కర్ల వ్యక్తిగత ఖాతాల్లో వెంటనే జమ చేయాలని డీపీవో సూచించారు.

విధులపై నిర్లక్ష్యం తగదు

- వీసీ యాదగిరిరావు



తెయూ(డిచ్‌పల్లి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ టీ యాదగిరిరావు హెచ్చరించారు. బుధవారం క్యాంపస్‌లోని పరిపాలనా భవనాన్ని వీసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధిక శాతం మంది ఉద్యోగులు గైర్హాజరుకావడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీను సందర్శించి తరగతి గదులు, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, తక్కువగా ఉన్న విభాగాల హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, వివిధ విభాగాధిపతులు ఉన్నారు.

మహిళా 'శక్తి'



డొంకేశ్వర్(ఆర్మూర్): మగువా.. మగువా.. లోకానికి తెలుసా నీ విలువ..అంటూ ఓ సినిమాలోని పాట అందరికీ తెలిసే ఉంటుంది. ఈ ఫొటోను చూస్తుంటే ఆ పాటే గుర్తుకు వస్తోంది. నిప్పులో కాల్చిన కర్రును తన భర్త పట్టుకోగా, పది కిలోల బరువైన సుత్తెతో కర్రును కొడుతోంది. తాము ఎందులో కూడా తక్కువ కాదని ఈ చిత్రం ద్వారా 'మహిళా శక్తి'ని చాటి చెప్తోంది. భార్యాభర్తలిద్దరూ పొట్టకూటి కోసం డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామానికి వచ్చారు. రైతులు తెచ్చిన కొడవళ్లు, గొడ్డళ్లు, కత్తులు, కర్రులను కాల్చి ఇలా సాన పెడుతున్నారు. ఊరూరికీ వెళ్లి పని చేసి తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు 'సాక్షి'కి తెలిపారు.

చావులోనూ వీడని బంధం

సిరికొండ: జీవితాంతం కలిసి మెలిసి ఉన్న భార్యాభర్తలు చావులోనూ కలిసే వెళ్లారు. గడ్కోల్ గ్రామానికి చెందిన సిరిపురం నడ్పి నర్సయ్య(76), నర్సవ్వ(68) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమారులు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నర్సయ్య బుధవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబసభ్యులు అతడి అంత్యక్రియలు నిర్వహించి ఇంటికి వచ్చేలోగా భార్య నర్సవ్వ కూడా మృతి చెందింది. భార్యాభర్తలు ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

అభివృద్ధి వైపు అడుగులు

- నగరంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న దిలీప్‌కుమార్
- దుబారా ఖర్చులను తగ్గించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- తొమ్మిది నెలల్లో తన మార్క్ చూపిస్తూ ముందుకెళుతూ..
- 'సాక్షి' ఆధ్వర్యంలో అమ్మనగర్‌లో క్షేత్రస్థాయి పర్యటన

నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ తొమ్మిది నెలల్లో తన మార్క్ చూపిస్తూ నగర అభివృద్ధికి తనదైన శైలిలో ముందుకెళుతున్నారు. రెగ్యులర్‌గా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. తన వద్దకు వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం నేరుగా వెళ్లి పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం తెల్లవారుజామున 'సాక్షి' ఆధ్వర్యంలో నగరంలోని అమ్మనగర్‌లో క్షేత్రస్థాయి పర్యటన చేసి సమస్యల గురించి తెలుసుకున్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



అమ్మనగర్‌లో తెల్లవారుజామున పర్యటిస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్, కాలనీవాసులు

మున్సిపల్ కమిషనర్ గా దిలీప్‌కుమార్ వచ్చిన తర్వాత బల్దియాలో దుబార ఖర్చులు తగ్గాయి. మున్సిపల్ వాహనాల డీజిల్ బిల్లు గతంలో ప్రతి నెల రూ.32 లక్షల మేర వచ్చేది. కమిషనర్ పెట్రోల్ పంపు మార్పు చేయడంతో ప్రస్తుతం ఇంధనం బిల్లు రూ.25 లక్షలకు తగ్గింది. బల్దియాకు సుమారు రూ.7 లక్షల వరకు ఆదా అవుతోంది. అవుట్‌సోర్సింగ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వద్ద ఉన్న డీజిల్ కూపన్లను రెగ్యులర్ ఉద్యోగి వద్ద ఉండేవిధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో అవినీతి అరికట్టి ఆదా చేశారు.

❖ మున్సిపల్ వాహనాల మరమ్మతుల బిల్లు ప్రతి నెల రూ.8 లక్షలు వచ్చేది. ప్రస్తుతం ఈ ఖర్చును రూ.3 లక్షలకు పరిమితం చేశారు. దీంతో రూ.5 లక్షలు ఆదా అవుతోంది. తాజాగా ఫిల్టర్‌బెడ్ సమీపంలో ప్రత్యేకంగా ముగ్గురితో మెకానిక్ షెడ్ ఏర్పాటు చేశారు. ఇందులో ఎంటెక్ చదివిన వ్యక్తిని నియమించారు.

❖ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ భూములు, మున్సిపల్‌కు చెందిన 10 శాతం స్థలాలను నిర్ధారించేందుకు ప్రత్యేకంగా సర్వే చేయిస్తున్నారు.

❖ పనుల పారదర్శకత, జవాబుదారి కోసం ఏళ్లతరబడి ఒకే జోన్‌లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ ఏఈలు, డిప్యూటీ డీఈలను స్థానభ్రంశం చేశారు.

❖ ఆఫీసుకు రాకుండా వేతనాలు పొందుతున్న సిబ్బందిని కట్టడి చేశారు.

❖ శానిటేషన్ విభాగంలో విధులకు హాజరు కాకుండా జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులను కట్టడి చేశారు.

❖ కుక్కల బెడద నివారించేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ రెండు డివిజన్లలో రాత్రి సమయాల్లో కుక్కలను పట్టి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రంలో అప్పగిస్తున్నారు. వాట్సప్ గ్రూపులో కుక్కలను పట్టిన ఫొటోలను అప్‌లోడ్ చేయిస్తున్నారు.

❖ వీధిదీపాల ఏర్పాటు కోసం ఈ–ప్రొక్యూర్‌మెంట్ టెండర్లకు ఏర్పాట్లు చేస్తున్నారు.

❖ రాజీవ్‌గాంధీ చౌరస్తా, నెహ్రూ పార్క్, కాలూరు చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, పులాంగ్ చౌరస్తా సుందరీకరణకు ప్రణాళికలు తయారు చేయించారు.

❖ శానిటేషన్, డ్రెయిన్లకు సంబంధించి ఎప్పటికప్పుడు క్లియర్ చేయిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ సమస్యలు, కోర్టు కేసుల క్లియరెన్స్ కోసం ప్లాన్ చేసుకుని ముందుకెళుతున్నారు.



తెల్లవారుజాము నుంచే..

బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నగరంలోని అమ్మనగర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ కాలనీ వాసులు తమ సమస్యల విషయమై కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. 'సాక్షి' కార్యాలయానికి సైతం వచ్చి పలుసార్లు విన్నవించారు. దీంతో 'సాక్షి' చొరవతో కమిషనర్ ఈ కాలనీలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. తెల్లవారుజాము నుంచే ఈ కాలనీలో కలియదిరిగారు. సుమారు రెండు గంటల పాటు పర్యటించి వీధిదీపాలు, రోడ్లు, జంగిల్ కటింగ్ తదితర సమస్యలపై పరిశీలించి నోట్ చేసుకున్నారు. కాలనీవాసులతో మాట్లాడి అన్ని వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ 'సాక్షి' చొరవను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి వెళ్లే వంతెన లింక్ రోడ్డు పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. రోడ్లకు ఇరువైపుల, డివైడర్ల మధ్యలోని పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను వెంటనే తొలగించి, వనమహోత్సవంలో భాగంగా ఉపయోగకరమైన మొక్కలు నాటిస్తామన్నారు. వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. కాలనీలో కుక్కల బెడదను నివారిస్తామన్నారు. మూడున్నర ఎకరాల పార్కును అభివృద్ధి చేస్తామని అమ్మనగర్ కాలనీ వాసులకు తెలిపారు. కమిషనర్ క్షేత్ర పర్యటనలో అమ్మనగర్ సొసైటీ అధ్యక్షుడు రెంజర్ల నరేశ్, అమ్మనగర్ గృహవాసుల సంఘం అధ్యక్షుడు యెండల కిషన్, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి కిషన్, ఉపాధ్యక్షుడు మాడవేడి వినోద్‌కుమార్, కోశాధికారి మహేందర్, కాలనీవాసులు న్యాలం రవి, దగ్గుల మధుసూదన్, పంచరెడ్డి ఎర్రన్న, ప్రవీణ్, ఈశ్వర్, రవి, రాజు, అనిల్, నారాయణ, వారాహి దేవాలయ కమిటీ చైర్మన్ మంచాల జ్ఞానేందర్, మాజీ కార్పొరేటర్ పంచరెడ్డి సూరి పాల్గొన్నారు. అమ్మనగర్ వాసులు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ రద్దు!

- రాష్ట్ర సంఘాన్ని గుర్తించని ఐవోఏ
- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అనుమతీ లేదు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ ఒలింపిక్ అసోసియేషన్ రద్దు అయ్యింది. భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ) రాష్ట్ర ఒలింపిక్ సంఘాన్ని గుర్తించకపోవడమే కారణంగా తెలుస్తోంది. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వద్ద సైతం ఒలింపిక్ సంఘానికి అనుమతి లేదు. ఒలింపిక్ అసోసియేషన్ రద్దయ్యిందని చెప్పడానికి ఇటీవల జిల్లా క్రీడల అధికారి ఆధ్వర్యంలో ఒలింపిక్ రన్ నిర్వహించడమే నిదర్శనం.

సమన్వయకర్తలుగా..

1992 సంవత్సరంలో జిల్లాలో ఒలింపిక్ సంఘం ఏర్పడింది. అప్పటి నుంచి నాలుగేళ్లకోసారి ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ అసోసియేషన్ జిల్లాలో ఉన్న క్రీడా సంఘాలకు, స్పోర్ట్స్ అథారిటీకి సమన్వయకర్తగా మా త్రమే పనిచేయాల్సి ఉంటుంది. క్రీడా సంఘా ల సమస్యల పరిష్కారానికి కలెక్టర్, ఇతర అధికారులను కలిసేందుకు ఒలింపిక్ సంఘం మధ్యవర్తిగా వ్యవహరించాల్సి ఉంటుంది. క్రీడా సంఘాలపై ఎలాంటి అజమాయిషీ ఉండదు. క్రీడా సంఘాలు వారి రాష్ట్ర సంఘాల పరిధిలో మాత్రమే పనిచేస్తాయి. జిల్లాలో రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నీలు నిర్వహించినప్పుడు ఒలింపిక్ సంఘం సమన్వయం చేయాల్సి ఉంటుంది.

జిల్లా క్రీడల అథారిటీ ఆధ్వర్యంలోనే..

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ రద్దు అయ్యిందని చెప్పడానికి జూన్ 21న నిర్వహించిన ఒలింపిక్ రన్ నిదర్శనంగా చెప్పవచ్చు. ఒలింపిక్ రన్‌ను జిల్లా యువజన క్రీడల అధికారి ఆధ్వర్యంలో నిర్వహించాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ నుంచి ఆదేశాలు వచ్చాయి. అందుకే ఒలింపిక్ సంఘాలు ఉన్నా నామమాత్రంగానే వ్యవహరించాయి. రాష్ట్ర ఒలింపిక్ సంఘానికి గుర్తింపు లేదని స్వయంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ చెప్పడం గమనార్హం. ఇక మీదట జిల్లాలో క్రీడా పోటీలు, క్రీడలకు సంబంధించిన సమస్యలు ఉన్నా జిల్లా స్పోర్ట్స్ అథారిటీనే పరిష్కరించనుంది. అధికారిక కార్యక్రమాలు, రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నీలు, పీఈటీ, పీడీలకు డిప్యుటేషన్ తదితర అంశాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు డీవైఎస్‌వో ద్వారానే జరగనున్నాయి.

విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



నగరంలోని పవర్‌హౌస్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

- విధులు బహిష్కరించిన ఉద్యోగులు

సుభాష్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యుత్ జేఏసీ చైర్మన్ రఘునందన్, రాష్ట్ర కార్యాచరణ కార్యదర్శి ఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ ప్రయివేటీకరణ, ఫ్రాంఛైజీ విధానాలకు వ్యతిరేకంగా విద్యుత్ ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు బుధవారం నగరంలోని పవర్‌హౌస్‌లో ఉద్యోగులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రయివేటీకరణ అమలైతే ప్రజలకు భారమైన టారీఫ్‌లు, వ్యవసాయదారులకు సబ్సిడీల తగ్గింపు, ఉద్యోగ భద్రతపై ముప్పు, సామాన్యులపై భారం తప్పదని హెచ్చరించారు. విద్యుత్ రంగం ప్రజల హక్కుగా ఉండాలని, లాభాల కోసం ప్రయివేటీకరణ చేయడం సమంజసం కాదని స్పష్టంచేశారు. ప్రజారంగ విద్యుత్ సంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్ పీ గంగాధర్, కన్వీనర్ ఆర్ బాలేశ్‌కుమార్, కో కన్వీనర్ తోట రాజశేఖర్, నాయకులు కాశీనాథ్, ఆర్ చంద్రశేఖర్, నాంపల్లి, వేణుగోపాల్, రాజేందర్‌రెడ్డి, చెన్నయ్య, అశోక్, ప్రసాద్‌రెడ్డి, రాజేందర్ గౌడ్, పోశెట్టి, ఉమారాణి, సునీత, సుహాసిని, లింగం మూర్తి, జీ శ్రీనివాస్, రామకృష్ణ, సతీశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీలోకి తగ్గిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గడంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి వరద నీరు తగ్గుముఖం పట్టింది. ప్రాజెక్టులోకి 4,300 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 341 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టులో 1067.70 (19.8టీఎంసీలు)అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు. గతేడాది ఇదే రోజున ప్రాజెక్టులో 1061.7 (12.2 టీఎంసీలు) అడుగు నీరు నిల్వ ఉంది.

ఎవరికి చెప్పుకోవాలి..?

- ఆర్టీసీ బస్టాండ్ దుకాణాల్లో అడ్డగోలు ధరలు
- బ్రెడ్ ప్యాకెట్ రూ.70.. చిన్న సమోసా రూ.7
- ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక ప్రయాణికుల్లో అయోమయం
- ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు
- నిజామాబాద్ ప్రధాన బస్టాండ్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యం



నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లోని షాపులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ప్రధాన బస్టాండ్‌లో తినుబండారాల దుకాణాలు నడిపిస్తున్న వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిజామాబాద్ బస్టాండ్ నుంచి ప్రతి రోజూ వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు సుమారు 1.60 లక్షల మంది రాకపోకలు సాగిస్తారు. దీంతో బస్టాండ్‌లోని దుకాణాలు కిటకిటలాడుతాయి. ఇదే అదునుగా భావిస్తున్న దుకాణాల నిర్వాహకులు తినుబండారాలకు అడ్డగోలు ధరలను నిర్ణయిస్తున్నారు. ఎంఆర్‌పీ కన్నా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్టాండ్‌లో 72 షాపులు ఉండగా ప్రస్తుతం 51 దుకాణాలు కొనసాగుతున్నాయి.

తినుబండారాలు, నీళ్ల బాటిల్ ధరలు వింటున్న ప్రయాణికులు ఇదేమిటని ప్రశ్నిస్తే దిక్కున్నచోట చెప్పుకోమనే నిర్లక్ష్య సమాధానం వ్యాపారుల నుంచి వస్తుండగా.. అసలు ఎక్కడ ఫిర్యాదు చేయాలో ప్రయాణికులకు తెలియని పరిస్థితి ఉంది. అయితే అధికారులు మాత్రం తమకు ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటామంటున్నారు. బస్టాండ్‌లో ఎక్కడ కూడా ఎమ్మార్పీ ధరలకు వస్తువులు విక్రయించాలి.. ఏవైనా సమస్యలు ఉంటే ఇక్కడ ఫిర్యాదు చేయొచ్చని బోర్డులు కనిపించడం లేదు. ప్రతిరోజూ ప్రయాణికులు, దుకాణాల నిర్వాహకుల మధ్య వాగ్వాదాలు మామూలు విషయంగా మారింది. ఇదంతా చూస్తున్న అధికారులు మాత్రం స్పందించడం లేదు.

రోడ్డుపై షట్టర్ నిర్మాణం

ఆర్‌ఎం కార్యాలయం కింద ఉన్న ఖాళీ స్థలాన్ని అద్దెకు ఇచ్చేందుకు ఆర్టీసీ అధికారులు టెండర్ నిర్వహించారు. అయితే బస్టాండ్ ప్రహరీని తొలిగించి బస్టాండ్‌తోపాటు రోడ్డు పైన షట్టర్ నిర్మించారు. ప్రహరీని తొలిగించిన వ్యక్తిపై ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆర్టీసీ అధికారులు ప్రహరీని తీసి వేసి షట్టర్ వేస్తే మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకోలేదు.

ధరలు వింటే దడేల్..

మార్కెట్‌లో లీటర్ వాటర్ బాటిల్ ధర రూ.20 ఉండగా, బస్టాండ్‌లో మాత్రం రూ.25 నుంచి రూ.30 తీసుకుంటున్నారు. రూ.40 బ్రెడ్ ప్యాకెట్‌ను రూ.70కి, నాలుగు రూపాయల చిన్న సమోసాను రూ.7కి విక్రయిస్తున్నారు. అయితే ఎక్కడ కూడా పరిశుభ్రత కనిపించదు. సంబంధిత అధికారులు తనిఖీలు చేయడం ఇంత వరకూ చూడలేదని ప్రయాణికులు అంటున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఆర్టీసీ బస్టాండ్ లోని దుకాణాల్లో తినుబండారాలు, ఇతర వస్తువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటాం. ఆర్టీసీ సిబ్బందికి ప్రయాణికులు నేరుగా ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు అందిన వెంటనే షాపునకు నోటీసు ఇచ్చి రద్దు చేస్తాం.

– జ్యోత్స్న, ఆర్టీసీ ఆర్‌ఎం

కదిలొచ్చిన కార్మిక లోకం



నిజామాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల జేఏసీ నాయకులు

కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమ్మె విజయవంతమైంది. జిల్లాలో భారీ నిరసన ర్యాలీలు చేపట్టారు.

'ఇందిరమ్మ ఇళ్ల'లో నిర్లక్ష్యం తగదు

- రెవెన్యూ దరఖాస్తులను త్వరితంగా పరిష్కరించాలి
- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పక్కన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. బోధన్ సబ్ కలెక్టర్ ఆఫీస్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, భూభారతి రెవెన్యూ దరఖాస్తులపై డివిజన్ స్థాయి అధికారులతో బుధవారం సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిలో నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దన్నారు. లబ్ధిదారులందరూ ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఆర్థిక స్తోమతలేని వారికి ఐకేపీ, మెప్మా ద్వారా రుణాలు అందించాలని, ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. మీ సేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన రుసుము కంటే అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లి తహసీల్దార్ దత్తాద్రి, ఏవో సిద్ధిరామేశ్వర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్

ఎడపల్లి తహసీల్ కార్యాలయం తనిఖీ

భూభారతి గ్రామ రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను వెనువెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎడపల్లి తహసీల్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ దత్తాద్రిని అడిగి తెలుసుకున్నారు. ఆఫీసులో పలు రికార్డులను కలెక్టర్ పరిశీలించారు.

క్లుప్తంగా

జీపీ భవనాన్ని ప్రారంభించిన పారిశుద్ధ్య కార్మికురాలు



నెహ్రూనగర్‌ కాలనీ జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

బాల్కొండ: మెండోరా మండలం నెహ్రూనగర్‌ కాలనీలో నూతనంగా నిర్మించిన జీపీ భవనాన్ని పారిశుద్ధ్య కార్మికురాలు మీరాబాయి తో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు పారిశుద్ధ్య కార్మికులు పట్టుకొమ్మలు అని అన్నారు. కార్మికులు లేకుండా పంచాయతీ వ్యవస్థలను ఊహించుకోలేమన్నారు. పారిశుద్ధ్య కార్మికుల పాత్ర పల్లెల పరిశుభ్రతలో ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొండ లక్ష్మణ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి



పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ

కమ్మర్‌పల్లి: గ్రామాల్లో నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేయాలని ఆర్మూర్‌ ఏసీపీ జె వెంకటేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎస్‌లోని రికార్డులు, కేసు డైరీలు, నిత్య కార్యకలాపాల నమోదులను పరిశీలించారు. నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ప్రజలతో సౌమ్యంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన పరేడ్‌లో పాల్గొన్నారు. భీమ్‌గల్‌ సీఐ పి సత్యనారాయణ, ఎస్సై జి అనిల్‌రెడ్డి ఉన్నారు.

ఆలయాలకు నూతన కార్యవర్గం ఏర్పాటు

నిజామాబాద్‌ రూరల్‌: నగరంలోని జెండాబాలాజీ, శంభులింగేశ్వరాలయం, హమాల్‌వాడి సాయిబాబా ఆలయాలకు నూతన పాలకవర్గం ఏర్పాటు చేస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి జెండా బాలాజీ ఆలయానికి డైరెక్టర్లుగా ప్రమోద్‌కుమార్‌, నర్సింగ్‌రావు, కిరణ్‌ కుమార్‌, వేముల దేవిదాస్‌, లక్ష్మణ్‌, విజయ, రాజ్‌కుమార్‌లు, హమాల్‌వాడి సాయిబాబా ఆలయానికి డైరెక్టర్లుగా గంగాకిషన్‌, శ్రీరాం శ్రీనివాస్‌, పవన్‌కుమార్‌, శివలింగం, శాంతాబాయి నియామకం అయ్యారు. శంభులింగేశ్వరాలయానికి డైరెక్టర్లుగా బి మధు, కిశోర్‌, సంతోష్‌కుమార్‌, కమలకిశోర్‌, మామిడిశేఖర్‌, రమేశ్‌, రేఖలను నియమించినట్లు జిల్లా ఎండోమెంట్‌ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో చైర్మన్ల నియామకం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఇంజినీరింగ్‌ చదివించడం లేదని..

● ఎలుకల మందు తాగి యువతి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: తల్లిదండ్రులు తనకు నచ్చిన ఇంజినీరింగ్‌ విద్యను అందించడం లేదనే బాధతో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఓ యువతి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నాలుగో టౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అమ్మవెంచర్‌లో సుఖ్‌దేవ్‌ సోనమ్‌తో పాటు అతని భార్య గత రెండేళ్లుగా మేస్త్రీ పని చేస్తూ అక్కడ అద్దెకు ఉంటున్నారు. వీరి కుమార్తె సోహాని(19) మహారాష్ట్రలో ఇంటర్‌ పూర్తి చేసుకొని 40 రోజుల క్రితం జిల్లా కేంద్రానికి వచ్చింది. తనకు ఇంజినీరింగ్‌ చదవాలని ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు డబ్బులు లేవంటు నిరాకరించారు. దీంతో మనస్తాపానికి గురైన సోహాని ఈ నెల 6న ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మొదటా జీజీహెచ్‌కు తర్వాత ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

● రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ



ఆర్మూర్‌ పట్టణంలో సాగు చేస్తున్న డ్రాగన్‌ ఫ్రూట్‌



పిప్రిలో సాగు చేస్తున్న పూల తోట

పెర్కిట్‌(ఆర్మూర్‌): వ్యవసాయం రంగంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైతే రైతులకు లాభాలకంటే నష్టాలే మిగులుతాయి. అలాగే ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు ఒక్కోసారి గిట్టుబాటు ధర లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనం వేసిన నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు రైతులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యానవన పంటలను ప్రోత్సాహిస్తున్నాయి. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అనేక రాయితీలు ప్రకటిస్తున్నాయి.

పండ్లు, కూరగాయలకు..

ఉద్యానవన పంటల సాగుకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ అందజేస్తోంది. మిషన్‌ ఫర్‌ ఇంటిగ్రేటెడ్‌ డెవలప్‌మెంట్‌ ఆఫ్‌ హార్టికల్చర్‌(ఎంఐడీహెచ్‌) పథకం ద్వారా రాయితీ అందజేస్తున్నారు.

పథకంలో భాగంగా రైతులకు పండ్ల తోటలు, కూరగాయలు, పూలు తదితర పంటలకు, పరికరాలపై రాయితీ ఇస్తున్నారు. డ్రాగన్‌ ఫ్రూట్‌ పంటకు ఎకరానికి రూ.64,800, బొప్పాయి, సీతాఫలం పంటలకు రూ.7,200, మామిడి, జామ, నిమ్మ తోటలకు రూ.19,200, పూల సాగు, ఉల్లి, ప్లాస్టిక్‌ మాల్చింగ్‌కు ఎకరానికి రూ.8 వేల చొప్పున అందజేస్తున్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ అందజేస్తోంది. డ్రిప్‌ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తూ సబ్సిడీ ఇస్తోంది. ఆసక్తి గల రైతులు పాస్‌పోర్టు సైజ్‌ ఫొటో, పాస్‌బుక్‌, ఆధార్‌, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి రాయితీ పొందవచ్చు.– రాజు, ఉద్యానవన శాఖ అధికారి, ఆర్మూర్‌

విద్యార్థులు సమాజసేవలో ముందుండాలి

● వీసీ ప్రొఫెసర్‌ యాదగిరిరావు



రక్తదాన శిబిరంలో వీసీ యాదగిరిరావు, నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవా కార్యక్రమాల్లో ముందుండాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్‌–ఛాన్స్‌లర్‌ టి యాదగిరావు అన్నారు. బుధవారం తెయూ ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవం, ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఏబీవీపీ కేవలం విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేయడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రక్తదానంతో ప్రాణాపాయంలో ఉన్న వారిని రక్షించిన వారిమవుతామన్నారు. ప్రధాన వక్తగా హాజరైన ఏబీవీపీ ఇందూర్‌ విభాగ్‌ ప్రముఖ్‌ రెంజర్ల నరేశ్‌ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి యే లక్ష్యంగా ఏబీవీపీ జాతీయవాద స్ఫూర్తితో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ ఆంజనేయులు, ఏబీవీపీ స్టేట్‌ వర్కింగ్‌ కమిటీ మెంబర్‌ అమృత్‌ చారి, యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్‌, ఉపాధ్యక్షుడు అనిల్‌, నాయకులు నవీన్‌, సమీర్‌, పృథ్వీ, అక్షయ్‌, మనోజ్‌, అజయ్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ విభాగంలో క్యాంపస్‌ సెలెక్షన్స్‌



క్యాంపస్‌ ప్లేస్‌మెంట్‌ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ రసాయన శాస్త్ర(కెమిస్ట్రీ) విభాగం ఆధ్వర్యంలో హెటిరో డ్రగ్స్‌, హైదరాబాద్‌ కంపెనీ ప్రతినిధులు బుధవారం వర్సిటీలో క్యాంపస్‌ ప్లేస్‌మెంట్‌ డ్రైవ్‌ నిర్వహించారు. తెయూ మెయిన్‌ క్యాంపస్‌తో పాటు భిక్కనూర్‌ సౌత్‌ క్యాంపస్‌, గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలతో పాటు వివిధ అనుబంధ కళాశాలల నుంచి 102 మంది ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విద్యార్థులు ఈ సెలెక్షన్స్‌లో పాల్గొన్నట్లు విభాగాధిపతి సాయిలు తెలిపారు. ఇందులో రాతపరీక్షలో 54 మంది విద్యార్థులు ఎంపికకావడం సంతోషకరమైన విషయమన్నారు. ఇంటర్వ్యూ ద్వారా సెలెక్ట్‌ అయిన విద్యార్థుల జాబితాను రెండు రోజుల్లో మెయిల్‌ ద్వారా వర్సిటీకి పంపిస్తామని హెటిరో డ్రగ్స్‌ కంపెనీ ప్రతినిధులు తెలిపినట్లు సాయిలు పేర్కొన్నారు. రాతపరీక్షలో ఎంపికైన విద్యార్థులను వీసీ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్‌ ఎం యాదగిరి అభినందించారు. కార్యక్రమంలో హెటిరో డ్రగ్స్‌ కంపెనీ డిప్యూటీ చీఫ్‌ మేనేజర్‌ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఆర్‌ దుర్గాప్రసాద్‌, అసిస్టెంట్‌ మేనేజర్‌ శ్రీనివాసరావు, కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు నాగరాజు, బాలకిషన్‌, నాగరావు, సురేశ్‌, నాగేశ్వరరావు, రాజేశ్వరి, డానియల్‌, నాగేంద్రబాబు, సునీత, రఘువీర్‌, గంగాధర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త రీసైక్లింగ్‌ ప్రక్రియ వేగవంతం చేయాలి



డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న కమిషనర్‌

నిజామాబాద్‌ సిటీ: డంపింగ్‌ యార్డులో చెత్త రీసైక్లింగ్‌ ప్రక్రియ వేగవంతం చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు మున్సిపల్‌ కమిషనర్‌ దిలీప్‌కుమార్‌ సూచించారు. నగర శివారులోని నాగారం డంపింగ్‌ యార్డును కమిషనర్‌ బుధవారం పరిశీలించారు. సిబ్బందితో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. తడి, పొడిచెత్తను వేర్వేరుగా డంపింగ్‌ చేయాలని ఆదేశించారు. దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై ప్రభుదాస్‌కు సూచించారు. తడిచెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్యాకెట్లలో నింపి ఎరువులు సిద్ధం చేసి బయటి వ్యక్తులకు విక్రయించాలన్నారు. ఆయా జోన్‌ కార్యాలయాల వద్ద సేంద్రియ ఎరువుల బ్యాగ్‌లు అందుబాటులో ఉంచాలన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్‌: నగరంలోని 11 కేవీ లలితామహాల్‌ విద్యుత్‌ లైన్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ టౌన్‌–2 ఆర్‌ ప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రద్ధానంద్‌ గంజ్‌, ప్రభాత్‌ టాకీస్‌, హమాల్‌వాడి, నాందేవ్‌వాడ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిచిపోతుందన్నారు. అలాగే సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు తీన్‌ కమాన్‌, నిజాంకాలనీ, తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విద్యుత్‌ వినియోగదారులు సహకరించాలని ప్రసాద్‌రెడ్డి కోరారు.

కుస్తాపూర్‌ నంది పోచంపాడ్‌లో ప్రతిష్ఠాపన



పోచంపాడ్‌లోని శివాలయం



కుస్తాపూర్‌ నుంచి తీసుకొచ్చి ప్రతిష్ఠించిన నంది విగ్రహం

బాల్కొండ: శ్రీరాం సాగర్‌ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన కుస్తాపూర్‌ రామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి నందిని తీసుకొచ్చి పోచంపాడ్‌ శివాలయంలో ప్రతిష్ఠించారు.

మీకు తెలుసా?

- పోచంపాడ్‌లో గోదావరి తీరాన కుస్తాపూర్‌ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని 1969వ సంవత్సరంలో పునఃనిర్మాణం చేపట్టారు.
- శ్రీరాముడు వనవాస కాలంలో కుస్తాపూర్‌ వద్ద బ్రహ్మ హత్య పాపం పోయేందుకు పూజలు చేసినట్లు చరిత్ర చెబుతోంది.
- కుస్తాపూర్‌ వద్ద శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగంగా ప్రసిద్ధి చెందింది.
- నాడు ఆలయం ముంపునకు గురి కావడంతో పోచంపాడ్‌ వద్ద తిరిగి పునఃనిర్మించారు. కాగా కుస్తాపూర్‌ నుంచి నందిని మాత్రమే తీసుకొచ్చి నూతన ఆలయంలో ప్రతిష్ఠించినట్లు గ్రామ పెద్దలు పేర్కొంటున్నారు.
- శ్రీరాముడు ఇసుకతో చేసిన శివలింగం ముంపునకు గురైన కుస్తాపూర్‌ ఆలయంలోనే ఉంది.
- ఎస్సారెస్పీ నీటి మట్టం డెడ్‌ స్టోరేజీకి చేరువలో ఉన్నప్పుడు ఆలయం బయల్పడుతుంది. అప్పుడు అక్కడ కూడా భక్తులు పూజలు చేస్తారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్‌ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ, లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్‌ బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, భూసేకరణ, భారీ వర్ష సూచనల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, భూభారతి తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్‌ కమిషనర్లు, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, వైద్యాధికారులు, హౌసింగ్‌ ఏఈలు, ఐకేపీ ఏపీఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష చేపట్టారు. మండలాల వారీగా ఆయా అంశాల్లో ప్రగతిని సమీక్షిస్తూ, అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి కలెక్టర్‌ సూచనలు చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను కేటగిరీల వారీగా విభజిస్తూ, సత్వరమే వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేయాలన్నారు. ఆగస్టు 14 నాటికి అన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలన్నారు. కాగా, భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ చేసిన సూచనల దష్ట్యా, అవసరమైన ప్రాంతాల్లో ముందస్తుగానే అప్రమత్తతతో కూడిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ సూచించారు. కొత్త రేషన్‌ కార్డులు, పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, వెంటవెంటనే పరిశీలిస్తూ అర్హులకు మంజూరు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా వారికి ఉచితంగా ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్‌ కిరణ్‌ కుమార్‌, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పూడిక తొలగింపు

• గాండ్లపేట్‌ వద్ద పొలాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకున్న అధికారులు





తొలగించిన పూడిక మట్టి

మోర్తాడ్‌: మండలంలోని గాండ్లపేట్‌ శివారులోని చిన్న కాలువలో పూడికపోయిన మట్టిని నీటి పారుదల శాఖ అధికారులు తొలగింపు చర్యలు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా కాలువలో మట్టి పేరుకుపోవడంతో వరద నీటితో సమీపంలోని పొలాలు ముంపునకు గురయ్యేవి. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇదే సమస్య తలెత్తుతుండడంతో ఇటీవల రైతులు రాష్ట్ర సహకార సంఘాల అసోసియేషన్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మానాల మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన కాలువలో పూడిక పోయిన మట్టి తొలగింపునకు చేపట్టే అంచనాలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. స్పందించిన అధికార యంత్రాంగం ప్రొక్లెయిన్‌తో పూడిక మట్టి తొలగింపు చర్యలు చేపడుతున్నారు. కాలువలో మట్టి తొలగించడంతో వరద పెద్దవాగులోకి వెళ్లేందుకు మార్గం సుగమమైంది. చేపట్టిన పూడిక తొలగింపు పనులతో భారీ వర్షాలు కురిసినా వరద పొలాలకు రాకుండా వాగులోకి వెళ్తుందని రైతులు పేర్కొంటున్నారు. అడిగిన వెంటనే సమస్యను పరిష్కరించిన మానాల మోహన్‌రెడ్డికి, అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో ఏఎస్సై భార్య మృతి

నిజామాబాద్‌ రూరల్‌: కుక్కను తప్పించబోయి డివైడర్‌ను బైక్‌ ఢీకొన్న ఘటనలో ఓ ఏఎస్సై భార్య మృతి చెందిన ఘటన కంఠేశ్వర్‌ బైపాస్‌ ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. రూరల్‌ పీఎస్‌ పరిధిలోని కేసీఆర్‌ కాలనీ ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇంటలిజెన్స్‌ ఏఎస్సై భూమయ్య బుధవారం విధులకు వెళ్లగా భార్య భవాని(52), కుమారుడు చంద్రతేజ ఉదయం బాసరలోని అమ్మవారి దర్శనానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కేసీఆర్‌ కాలనీ వద్ద కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు డివైడర్‌కు ఢీకొన్నారు. ఈ ఘటనలో భవాని తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

● 1.435 కిలోల ఎండు గంజాయి పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని పలు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డి బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని అర్సపల్లి, ఎల్లమ్మగుట్ట, అసద్‌ బాలానగర్‌ ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ పేర్కొన్నారు. ఈ దాడిలో నిందితులు షేక్‌ పర్వేజ్‌, కసిలేరు మాధవ్‌, నజయా బేగంల నుంచి 1.435 కిలోల ఎండు గంజాయితో పాటు రెండు సెల్‌ ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడిలో ఎక్సైజ్‌ కానిస్టేబుళ్లు రాజు, నారాయణ రెడ్డి, కానిస్టేబుళ్లు భోజన్న, షమీన్‌, శివ, సాయి, విష్ణు, అవినాష్‌ మంజుల తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్‌ గ్యాంగ్‌ అరెస్ట్‌



ఖలీల్‌వాడి: నగరంలో కత్తులతో బెదిరించి నగదు వసూలు చేస్తున్న ఓ రౌడీషీటర్‌ గ్యాంగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి చెందిన బర్కాత్‌ అమీర్‌ అనే రౌడీషీటర్‌ తన సభ్యులతో కలిసి గత నెల 7న ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న షేక్‌ షారుక్‌ అనే వ్యక్తి నుంచి డబ్బులు ఇవ్వాలంటు కత్తులతో బెదిరించి దాడి చేసి రూ. 400 నగదును లాక్కున్నారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు రౌడీషీటర్‌ బర్కాత్‌ అమీర్‌తో పాటు సభ్యులు మహమ్మద్‌ షేక్‌ హసీమ్‌, ముద్దస్సిర్‌, షేక్‌ సుల్తాన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

ఎత్తిపోతలకు మళ్లీ తాళం

- భారంగా పథకం నిర్వహణ
- పేరుకుపోయిన రైతుల పన్ను బకాయిలు
- ప్రధాన పంప్‌హౌజ్‌లో ప్యానెల్‌ బోర్డు సామగ్రి చోరీ
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన



సాలూర మండలంలోని మంజీర నది తీరంలో ఉన్న ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్‌హౌజ్‌

బోధన్‌: సాలూర గ్రామ శివారులోని మంజీర నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకానికి మళ్లీ తాళం పడింది. ఏడాదిన్నర క్రితం దుండగులు ఈ పథకానికి సంబంధించిన కరెంట్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి తీగలు, ఆయిల్‌ను అపహరించారు. దీంతో పంప్‌హౌజ్‌కు తాళం వేశారు. స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌ రెడ్డి చొరవతో రూ.10 లక్షలు మంజూరు చేయించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టడంతో పథకం వినియోగంలోకి వచ్చింది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌ ప్రారంభానికి ముందు ఎత్తిపోతల పథకం ప్రధాన పంప్‌హౌజ్‌లో కరెంట్‌ మోటార్ల ప్యానెల్‌ బోర్డు అపహరణకు గురైంది. దీంతో లిఫ్ట్‌కు మళ్లీ తాళం పడింది. నిర్వహణ కమిటీ వద్ద డబ్బులు లేకపోవడంతో మరమ్మతులో జాప్యం జరుగుతోంది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది.

2009లో పథకం ప్రారంభం

ఉమ్మడి రాష్ట్రంలో దివంగత సీఎం వైఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి హయాంలో ఎత్తిపోతల పథకానికి రూ.3.80 కోట్లు మంజూరు చేశారు. పనులు పూర్తిచేసి 2009లో పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద 1600 ఎకరాలను స్థిరీకరించారు. వర్షాధార మెట్ట భూములు సస్యశ్యామలమయ్యాయి. ఈ పథకాన్ని రైతులు ఐక్యతతో సద్వినియోగం చేసుకోవడంలో సఫలమై లబ్ధిపొందారు. సిబ్బంది వేతనాలు, ఇతర ఖర్చుల కోసం రైతులు మాగాణి ఎకరానికి రూ.800, మెట్ట ఎకరానికి రూ.600 చొప్పున పథకం కమిటీకి చెల్లిస్తారు. రైతులు చెల్లించాల్సిన పన్ను బకాయిలు పేరుకుపోయాయి.

దిగువకు మంజీర జలాలు

ఏటా వర్షాకాలం ప్రారంభంలో మంజీర నదిలో వరద నీరు చేరగానే లిఫ్ట్‌ మోటార్లు ప్రారంభించి గ్రామ శివారులోని చెరువులను నింపుతారు. ఈసారి నెల క్రితమే మంజీరలో వరద నీరు చేరినా మోటార్లు సిద్ధంగా లేకపోవడంతో దిగువకు కదలిపోతున్నాయి. ప్రస్తుతం గ్రామ శివారులోని ఏడు చెరువుల్లో నీళ్లు అడుగంటాయి. చెరువుల కింద కరెంట్‌ బోరుబావులున్న రైతులు మాత్రమే వరినాట్లు వేస్తున్నారు. ఎత్తిపోతల పథకం కింద ఉన్న వందలాది ఎకరాల వర్షాధార మెట్ట భూముల్లో ప్రధానంగా సోయా మొలకెత్తింది. ఈ విషయమై సంఘం చైర్మన్‌ అల్లె జనార్దన్‌ దృష్టికి తీసుకెళ్లగా రైతుల సహకారంతో పథకం ప్రారంభానికి అన్నివిధాలా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు.



సాలూర గ్రామ శివారులోని మంజీర నదిలో ప్రవహిస్తున్న నీరు



సాలూర ఎత్తిపోతల పథకం కింద మెట్ట భూముల్లో సాగైన సోయా పంట

విద్యుత్‌ షాక్‌తో గేదె మృతి



మోర్తాడ్‌: మండల కేంద్రంలో మహేందర్‌కు చెందిన గేదె విద్యుత్‌ షాక్‌తో మృతి చెందింది. బుధవారం ఉదయం మండల సమీపంలో మేతకు వెళ్లిన గేదె ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.1.30లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

బీరు సీసాతో ఒకరిపై దాడి

నవీపేట: మండల శివారులో మంగళవారం రాత్రి వన భోజనాలకు వెళ్లిన బిల్లి రాకేశ్‌ అనే వ్యక్తి తాగిన మైకంలో ఒకరిపై బీరు సీసాతో దాడి చేసినట్లు ఎస్సై వినయ్‌ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నవీపేటకు చెందిన సాధక్‌ అలీ అనే యువకుడు బిల్లి నరేశ్‌ వద్ద కొంత కాలంగా మేకల కాపరిగా పని చేస్తున్నాడు. బిల్లి నరేశ్‌ బంధువులతో కలిసి వన భోజనాలకు వెళ్లగా వరుసకు సోదరుడైన బిల్లి రాకేశ్‌ మద్యం మత్తులో సాధక్‌ అలీతో గొడవపడి బీరు సీసాతో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తొమ్మిది మందికి ఒక రోజు జైలు

బోధన్‌టౌన్‌: బోధన్‌ పట్టణంలోని రాకాసీపేట్‌లో పేకాట ఆడుతూ పట్టుబడిన తొమ్మిది మందికి సెకండ్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ శేష సాయి తల్ప ఒక రోజు జైలు శిక్షను విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ బుధవారం తెలిపారు. పట్టణంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామని ఇందులో పట్టుబడ్డ తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ పేర్కొన్నారు. సాక్ష్యాలను పరిశీలించిన జడ్జి వీరికి ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ. రెండు వేల జరిమానాను విధించినట్లు సీఐ వెల్లడించారు. పేకాట ఆడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.